


# అసమర్థుల తప్పటడుగులు

ఆ చిన్న స్టేషన్‌లో పెట్టె, బెడ్డింగుతో రైలు దిగిన చలపతికి — ఒక్క కూలివాడు కూడా దొరకడం కష్టమైపోయింది. చివరకు ఒక గంటసేపు తంటాలుపడి, స్టేషన్ మాస్టర్ సహాయముతో కూలివాణ్ణి కుదుర్చుకొని — అక్కడికి మైలుదూరములోవున్న గ్రామముకేసి నడిచిపోసాగాడు.

గ్రామం సమీపించింది.

"ఈ గ్రామం పేరేమిటోయ్"

"శివపురంబాబూ! "కూలీవాడు జవాబు చెప్పాడు.

"ఊరు పెద్దగానే వుంటుందా!"

"ఏదో మధ్యరకం బాబూ" కూలివాడు చెప్పాడు.

కుక్కల మొరుగులు, ఊరివారి అరపులు క్రమముగా విన్పడసాగాయి. ఊరి పొలిమేరలో ప్రవేశించారు.

ఇంకా కొంచెము ముందరకు వెళ్ళగానే, చలపతికి ఒక చిన్నచెఱువులాంటిది దానికివేసిన గట్టుకన్పించాయి. ఆ గట్టుపై పెద్దపెద్ద చింతచెట్లున్నాయి. ఆ గట్టుకు తూర్పువైపున ఒక పెద్దమఱ్ఱిచెట్టు—దానికి కొంచెము ఎడంగా శివాలయం వుంది. ఆ ఆలయము చుట్టుప్రక్కలను ఏవేవో తీగచెట్లు దట్టంగా అల్లుకపోయాయి. వాటిచుట్టూ పుట్టలు, చిన్నచిన్నపొదలు, ముండ్లచెట్లు అంతా గుబురుగావున్నాయి. రాత్రివేళ ఆప్రదేశాన్నిచూస్తే ఎవ్వరైన భయపడక మానరు.

ఆ మఱ్ఱిచెట్టుక్రిందకు వచ్చిన చలపతి ఆ గుడి ముఖద్వారంవైపు చూసి భయాశ్చర్యాలతో కొయ్యబారిపోయాడు.

"అవి నాగుపాములు బాబూ" అని కూలివాడు చెప్పాడు. ఆ రెండు నాగుపాములు లావుగా, పొడుగ్గా భయంకరముగావున్నాయి. ఆ పాములు ఒక క్షణంసేపు తమ పడగలువిప్పి వీరివైపు చూసి బుసలుకొట్టూ ప్రక్కలకు వెళ్ళిపోయాయి.

వాటిని చూస్తున్నంతసేపు చలపతికి కడుపులో ఎవరో చెయ్యిబెట్టి కలియబెట్టినట్లైంది. ఇక అక్కడ నిలవలేక ఊరువైపు గబగబ నడచుకుంటూవెళ్లిపోయాడు.

* * *

ప్రప్రథమంగా స్కూల్‌మాస్టర్‌గా వచ్చిన చలపతికి ఆ గ్రామమునసబు రామినాయుడు తన ఇంటిలోనే ఒక గది అతనికిచ్చాడు.

చలపతి పాతికేండ్ల యువకుడు. ఈ వూరిలో స్కూల్‌మాస్టరుగా నియమింపబడ్డాడు.

రామినాయుడు స్వభావసిద్ధంగా మంచివాడు. జుట్టు అచ్చటచ్చట నెరసిపోయినది. దబ్బపండు శరీరచ్ఛాయ, ఆజాను

రచయిత:
మాణిక్య సుమిత్రా దేవి

బాహువు, బుగ్గమీసాలు. ఆయన పైకి ఎంత భయంకరముగా కన్పిస్తున్నాడో లోపల అంత ఉదారహృదయుడు.

రామినాయుడుగారి భార్య లక్ష్మమ్మ. దయకుమారు పేరు అందరిని సమానముగా తనవారిలాగే చూచే వ్యక్తిత్వం ఆమెది. ఆ దంపతుల కిద్దరు సంతానం. ఒకరు విమల. రెండోవాడు సుదర్శనం.

విమల మిడిల్‌స్కూల్‌వరకు చదివింది. తీర్చిదిద్దిన కనుబొమ్మలు — విశాలనయనాలలో తొణికిసలాడే కొంటెతనంతో చలాకీగా వుంటుంది. ఆమె గులాబిరంగు పెదిమెలపై సదా చిఱునవ్వు చిందులాడ్తుంటుంది. పసిడిచ్ఛాయగల ఆమె శరీరం యౌవ్వనంతో మిసమిసలాడ్తుంది. సుదర్శనానికి సుమారు పదిసంవత్సరాలుంటాయి.

ఆరోజు ఉదయము చలపతి గదిగుమ్మం వద్ద నిలబడ్డాడు. నీళ్ళబిందెను చంకన బెట్టుకొని — క్రీగంటిచూపులతో తనకేసి చూస్తూ లోనికెళ్ళిన విమలను చూడగానే అతని ఆలోచనకు అంతులేకపోయింది.

గబగబ ముఖం కడుక్కొని కుంపటి ముట్టించడానికి ప్రయత్నం చేయసాగాడు.

మేష్టారు — అమ్మ యీరోజు అక్కడే కాఫీ—భోజనాలకు మిమ్మల్ని రమ్మంది" అంటూ సిగ్గుతో ముఖము క్రిందికిదించి చెప్పాడు సుదర్శన్.

చలపతి సరేనంటూ లోపలి కొచ్చాడు.

అక్కడొక టేబిల్ దానిచుట్టూ కుర్చీలు వున్నాయి. రామినాయుడుగారు కాఫీ ముగించి ఖాళీగ్లాసును టేబిల్‌పై పెట్టాడు.

చలపతి రామినాయుడుగారిని చూసి చిఱునవ్వుతో—

"నమస్కారమండీ" అన్నాడు.

రామినాయుడు ప్రతినమస్కారంచేసి ఎదురుగావున్న కుర్చీ చూపించాడు.

చలపతి కూర్చోగానే — విమల కాఫీగ్లాసుతో వచ్చింది. కాఫీగ్లాసును టేబిల్‌పై పెట్టి 'ఏంనాన్న పట్నం వెళ్తున్నావా" అంది. 'అవునమ్మా! ఇప్పుడే వెళ్తున్నాను. నీకేం తేవాలమ్మా' అని అడిగాడు రామినాయుడు.

చలపతి వెంటనే ఆడవారికంకేమిటి రావాలండి — నగలో, చీరెలోతప్ప అని చిఱునవ్వుతో అన్నాడు.

రామినాయుడుకూడ నవ్వుతూ 'అంతే లెండి' అన్నాడు.

"ఆడవారమైనంతమాత్రాన మాకింకేమీ అవసరంలేదా" బుంగమూతిపెట్టి అంది విమల.

రామినాయుడు పెద్దగానవ్వాడు. విమల కూడ నవ్వింది.

రామినాయుడు వెళ్ళిపోయాడు.

చలపతి కాఫీ ముగించి గ్లాసును టేబిల్ పై పెట్టాడు.

ఇంతలో లక్ష్మమ్మ 'ఏం నాయనా కాఫీ తాగావా' అంటూ చలపతిని ప్రశ్నించింది.

"ఆ త్రాగానండి — కాఫీ అమృతం లాగుంది.

"మా అమ్మాయే రోజూ కాఫీచేస్తుంది—నే చేస్తే దానికి రుచించదు" అని నవ్వుతూ అంది లక్ష్మమ్మ.

"ఫో అమ్మా! నీ వెప్పుడూ యింతే" అంటూ ఖాళీగ్లాసును తీసికొని లోనికెళ్ళి పోయింది.

విమల నవ్వుతూ వక్కపొడిని టేబిల్ పై వుంచింది. వక్కపొడిని నోట్లోవేసికొన్న చలపతి — 'మీరు చాలా అందముగా వున్నారు' అన్నాడు.

విమల మొదట అర్థంగానట్టు చూసి, పిదప ముత్యాల్లాంటి పలువరసను ఎఱ్ఱటి పెదిమలనుండి వికసింపచేసింది. వయ్యారంగా జడను ముందుకేసుకొని కొంటెగా చలపతివైపు చూస్తూ వెళ్ళిపోయింది.

* * *

ఆరోజు ఆదివారం సాయంత్రం అయిదు గంటలకు చలపతి షికారుకని చెఱువు గట్టు ప్రాంతాలకు వెళ్ళాడు. మరల·ఆ ప్రాంతాలవైపు రాగానే—అనాడు కన్పడిన నాగుపాములు కండ్లలో కదలగానే అతని శరీరం జలదరించింది. తిన్నగా వెళ్ళి చెఱువుగట్టుపై కూర్చొన్నాడు. గట్టుపై చింతచెట్లు గంభీరంగా కన్పిస్తున్నయి.

విమలను ఆమె సౌందర్యాన్ని తనలో చెలరేగినవాంఛలను ఆలోచిస్తు కూర్చుండి పోయాడు.

ఇంతలో వెనకవైపునుండి 'మేష్టారు' అన్న సుదర్శనం గొంతు విన్పడింది.

వెనక్కు తిరిగిచూచాడు. సుదర్శనం గంతులేస్తూ వస్తున్నాడు. అతని వెనుక విమలచేతిలో ఏదో పళ్లెంలాంటిది పట్టుకొనివస్తోంది.

విమల 'ఏమండీ మేష్టారూ మాతో చెప్పనైనా లేదే! ఇక్కడికి పోతున్నానని.'

"మీ రొస్తారని తెలిస్తే తప్పకుండా చెప్పేవుందును—మీరూ వచ్చారుగా"

విమల కిలకిలమని నవ్వి అతనికి కొంచెంచేరువలో కూర్చుంది.

"అక్కయ్యా నేను చింతచిగురుపువ్వు తెంపుకొస్తా" నంటూ చెట్లవైపు పరిగెత్తాడు సుదర్శన్.

"ఒఠి కొంటెవాడు"

"అతనికంటె మీరు మరీ కొంటెవారు" నవ్వుతూ అన్నాడు చలపతి.

"అయితే — నేను కొంటెదానినని మీరప్పుడే గ్రహించారన్నమాట...." చలపతి వైపు కండ్లు పెద్దవిచేసి అంది.

"మీకళ్ళే దాన్ని నిరూపిస్తాయి"

ఒకసారి కళ్ళను వయారంగా త్రిప్పి 'ప్రసాదంతీసుకొండి' అంటూ పళ్లెరంలోని ప్రసాదం పెట్టింది.

"అయితే మీరు ఆలయానికివచ్చారన్న మాట" ప్రసాదంతీసికొంటూ అన్నాడు.

విమల మౌనంగా తలూపింది.

"మీరు నాగుపాములను చూచారా" అని ఆందోళనాశ్చర్యాలతో అడిగాడు.

"ఆ—నాగుపాములా ఎందులో" భయముతో అడిగింది విమల.

చలపతి ఆనాడు తనుచూచిన పాముల సంగతిని చెప్పాడు.

"బాబోయ్ అవి నాకంటబడితే—ఇంకేమన్నావుందా" గుండెలపై చేయివేసి భయముతో అంది.

"విమలా—నీవీ స్థితిలో ఎంత అందముగా వున్నావనుకొన్నావు?" చలపతి వేసిన ఊహరాత్తుప్రశ్నకు విమల ఉక్కిరిబిక్కిరైంది.

"ఏం—అలా అంటున్నారు"

చలపతి ఆమెచేతిని, తనచేతిలోకి తీసికొని అప్యాయముతో నిమురసాగాడు.

విమల తలెత్తి అతనికన్నుల్లోకి చూసి చిరునవ్వునవ్వింది. వెంటనే ఆమెచేతిని ముద్దెట్టుకున్నాడు.

మరికొంతసేపటికి సుదర్శనంవొడిలో చింతచిగురుపూలతో ప్రత్యక్షమయ్యాడు. ఒకరి వెనక వొకరు గ్రామంవైపు నడిచి పోయారు.

స్త్రీ హృదయం తనంతట తాను ఎన్నడు కామవాంఛలను పురికొల్పదు. అదొక నిద్రావస్థలాంటిది. దానిని పురుషుడు రెచ్చగొట్టాలి. ఆలా జరిగినప్పుడు స్త్రీ వాంఛ ప్రళయతాండవం చేస్తుంది.

విమల యౌవ్వనవతి. చలపతి మొదటి సారిగా ఆమెను రెచ్చగొట్టాడు. ఆమెలో వాంఛ విపరీతంగా చెలరేగసాగింది.

ఆరోజు ఉదయం—

రామినాయుడు ఎక్కడికో ప్రయాణమవుతున్నాడు. లక్ష్మమ్మ—విమల అతని వెంటనే వున్నారు. చలపతి కాఫీత్రాగి వసారాలోకి వచ్చాడు.

చేతిలో గొడుగుపట్టుకొని — చెప్పులు వేసుకొంటున్న రామినాయుడినిచూసి చలపతి 'ఎటో వెళ్తున్నారు?' అన్నాడు.

చలపతినిచూసి రామినాయుడు నవ్వు ముఖంతో 'పట్నం వెళుతున్నానోయ్—రెండు మూడు రోజులు పట్టవచ్చు కొంచెం యింటిదిక్కు చూడు బాబూ' అన్నాడు.

"మీరు అంత చెప్పాలా" అన్నాడు వినయం వొలకబోస్తూ చలపతి

విమల — చలపతి క్రీగంటిచూపులతో చూసుకొన్నారు—

రామినాయుడు వెళ్లిపోయాడు. చలపతి ఆనాడు ఇంటివద్దనే వుండిపోయాడు.

మధ్యాహ్నమయింది—చలపతి మంచములో పడుకొని ఆలోచిస్తున్నాడు. విమల అతని గదిలోకొచ్చింది.

చలపతి నవ్వుతూ లేచి కూర్చొని—

"అమ్మలేదూ" అన్నాడు.

"వంటగదిలో పడుకొంది"

మంచముదగ్గరగావెళ్లి అతని ప్రక్కన కూర్చుంది. చలపతి గదితలుపులువేసి—విమలకు దగ్గరగా కూర్చున్నాడు. ఇద్దరి గుండెలు వేగముగా కొట్టుకుంటున్నాయి. వాంఛ వారిని లొంగదీసుకుంది.

అర్థగంట అయాక విడిపోయారు.

విమల నెమ్మదిగా తలుపులు తెరిచి సద్దుకాకుండా వెళ్ళి — లక్ష్మమ్మప్రక్కనే అమాయకురాలిలా పండుకొంది.

అర్థసంవత్సరము కాలచక్రములో దొర్లిపోయింది.

ఆరోజంతా విమల భయముతో విహ్వల అయింది. తన భవిష్యత్తు బ్రతుకును తలుచుకొని చాటుగా వెక్కివెక్కి యేడ్వసాగింది—అదది అంతకంటే యెక్కువేమి చేస్తుంది!

తన గతేమిటి! తను నెలతప్పింది! చలపతి తనను వివాహంచేసుకొంటానన్నాడు. అతడిమాటను నమ్మినా తనతండ్రి వర్ణాంతర వివాహానికి సమ్మతిస్తాడనా? నెల తప్పినట్లు ఆయనకు తెలిస్తే ఇంకేమన్నా వుందా? ఎంత ఉదారుడైనా స్వంత కూతురుచేసిన ఈ నీచాతినీచాన్ని క్షమించి వూరుకొంటాడా! ఏ తండ్రికూడ సహించి వూరుకోడు!

ఆమెకు భవిష్యత్తంతా భయంకరంగా గాఢాంధకారంగా కన్పించింది. తనుచేసిన పని మంచిదికాదని పదేపదే తలచుకొని కుమిలిపోసాగింది.

రాత్రి పదకొండు గంటలు అంతా నిశ్శబ్దము. విమల మెల్లగాలేచి—చలపతి గది తలుపులు మెల్లగా కొట్టింది. కొంచెంసేపటికి తలుపులు తెరిచాడు.

చలపతి ఆమెను దగ్గరకు తీసుకోబోయాడు. విమల కళ్లవెంబడి బొటబొట కన్నీరు కారాయి. చలపతి ఆశ్చర్యముతో ఏమిటి? అన్నాడు.

ఆమె చలపతి హృదయముపై తల దాచుకొని వెక్కివెక్కి యేడ్వసాగింది.

చలపతి భయముతో 'ఏమిటి విమలా' అని వీపుపై చెయ్యివేసి నిమిరాడు.

''నెల తప్పాను''

చలపతి ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. కాని ఆ సంగతి విమలకు తెలియనివ్వలేదు. గుండె భయముతో కొట్టుకోసాగింది.

విమల 'ఏమిటి ఉపాయము' అంది.

చలపతి తన భయాన్ని పైకిప్రదర్శించకుండా తెచ్చుకొన్న నవ్వుతో 'ఓస్—ఇంతేనా' అన్నాడు.

విమల కన్నీటిని తుడుచుకొని ఆశ్చర్యముతో అతనివైపు చూసింది

"ఇంతేనా విమలా! ఇంతదానికే భయపడుతున్నావా! నేను ముందే ఉపాయము ఆలోచించాను. ఎక్కడికైనా పారిపోయి హాయిగా స్వతంత్రంగా బ్రతుకుదాం' అని వెకిలిగా నవ్వుతూ అన్నాడు.

"పారిపోవడమా?"

"ఆ! పారిపోవడమే —ఏం ప్రపంచములో ఎందరో మనలాగే ప్రేమించుకొని, చివరకు పెద్దవారి శాసనాలకు భయపడి ఆత్మహత్యచేసుకోవడమో, పారిపోవడమో చేస్తారు. అయితే మనకు నేనుండగా ఆత్మహత్యచేసుకోవడానికి వీలులేదు! హాయిగా పారిపోయి బ్రతుకుదాం!"

విమలకు ఆ పరిస్థితిలో చలపతి నిజముగా ఓ దేవతలా కన్పడ్డాడు.

''కాని....'' సంశయించాడు చలపతి.

''ఏమిటి సంశయిస్తున్నావు'' ఆందోళనతో అడిగింది.

"ఆ ఏంలేదు డబ్బుకావాలి! నావద్ద ప్రస్తుతానికి కొంచమేవుంది — ఇంకొంత కావాలి''

"డబ్బుకు విచారించకు నాపైన కొన్ని నగలున్నాయి. ఇనప్పెట్టె తాళంచెవి నావద్దనే వుంటుంది. అందులో నాలుగైదు వేలుదాకావుంది, ఏం చాలదూ...." అమాయకంగా అడిగింది విమల.

"ఓ—చాలు. అబ్బ! నీవు నిజంగా ఎంత మంచిదానివి విమలా!" అంటూ కౌగలించుకొని ముద్దిడికొన్నాడు చలపతి.

కాని విమలింకా స్థిరంగా లేకపోయింది.

"ఎప్పుడు పోదాం!"

"ఎప్పుడో ఏమిటి—ఎల్లుండిరాత్రికే—చూడు! రేపు నేనింటివద్దనే వుంటాను. పగటివేళ మీ నాన్న వుండడు కదూ!—అమ్మ ఎలాగూ నిద్రపోతుంది. అదే సమయముచూసికొని డబ్బునుతీసుకురా నగలు ఎట్లాగూ నీ పైనే వున్నాయి — ఇంకేం" అన్నాడు చలపతి.

విమల మౌనముగా తలూపి మెల్లిగా వెళ్ళిపోయింది. చలపతి మంచముపై వాలిపోయాడు. అతని మెదడులో ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయి.

"ఛీ! ఛీ! చాలా బుద్ధితక్కువపనిచేశాను" అనుకోసాగాడు. పరిస్థితిని ఇంత తొందరగా ఎదుర్కొనవలసిరావడంతో అతడు కర్తవ్యమూఢుడయ్యాడు.

అతనికి రామినాయుడు జ్ఞప్తికొచ్చాడు. అజానుబాహువు — పైగా గ్రామమునసబు ఈసంగతి తెలిస్తే తనకు కుక్కలగతే— ఎట్లైనా పారిపోవాలి.

చలపతి పిరికివాడు పరిస్థితులకు భయపడ్డాడు. విమలతో లేచిపో బుద్ధికాలేదు. ఒక్కడే వెళ్ళిపోవాలనుకున్నాడు. పైగా ఈ సంగతి అతని తల్లిదండ్రులకు తెలిస్తే ఇంకేమయినా ఉందా?

విమల అనుకొన్నప్రకారం పగలు అతనిగదిలోకి వచ్చింది. జాకెట్టులోంచి రూపాయలకట్టలుతీసి అతని కందించింది దీనంగా. కాని చలపతి విమలదీనత్వాన్ని చూసేప్రయత్నములోలేదు. అతనికి కావలసింది తనొక్కడు పారిపోవడం డబ్బుతో సహా.

ఆమె వొంటిపైవున్న నగలుకూడ అడుగుదామనుకొన్నాడు. కాని ఆమెకు అనుమానము కలుగుతుందేమో అని మనస్సు పీకుతున్నా వూరుకున్నాడు.

"రాత్రి ఎప్పుడూ" అడిగింది విమల.

"తెల్లవారుఝాము నాలుగ్గంటలకు" అన్నాడు మెల్లగా రహస్యం చెప్పుతున్నట్లు అర్ధరాత్రి అనజాలక.

ఒక్కొక్క అడుగే బరువుగా వేసుకొంటూ వెళ్ళిపోయింది విమల.

రాత్రి తొమ్మిది గంటలైంది. సహజంగా పల్లెటూళ్ళో ఎనిమిది గంటలకే సద్దుమణుగుతుంటుంది.

చలపతి పెట్టె బెడ్డింగుతోసహా చప్పుడు కాకుండా పది గంటలవేళ, ఒక అమాయకప్రాణి గుండెలపైనుంచి నడుస్తూ బయటపడ్డాడు.

గబగబా నడవసాగాడు. గ్రామములో మొరిగే కుక్కల అరవులు అస్పష్టంగా ఆ గాలిహోరులో విన్పడుతున్నాయి.

ఆలయముముందటి మఱ్ఱిచెట్టుక్రిందకి వచ్చాడు. అప్రయత్నంగా అతని మనస్సులో ఆనాడు గుడిముఖద్వారం ముందు కన్పడిన జంటనాగుపాములు మెదలగానే చలపతి గాబరాచెందాడు. శరీరంలోంచి వేడిరక్తం ఆవిరిచెందుతుంది. ఆ ఆవిరి ఉపరితలమందు చెమట బిందువులుగా మారిపోయిందేమో — శరీరమంతా చెమటతో తడిసిపోయింది.

అంతరాత్మ యీపని మంచిదికాదని, ఒక ప్రపంచజ్ఞానం తెలియని అమాయక ప్రాణి భవిష్యత్తును నాశనంచేస్తున్నావని అరుస్తుంది.

అతని ఎదలో విమల ధారాపాతంగా కారుతున్న కన్నీటితో శోకమూర్తిలా తన పాదాలముందర మోకరిల్లి దీనంగా ప్రార్థిస్తున్నట్టనిపించింది.

అతడు విచలితుడైయ్యాడు. తిరిగివెళ్ళి విమల పాదాలపైపడి "క్షమించు"మందామనుకొన్నాడు. కాని ఏ దుర్భర శక్తో అతన్ని అలా చేయనియ్యలేదు.

మఱ్ఱి చెట్టు క్రిందనేవున్న ఒక చిన్న బాయిపై కూర్చొని—అఱచేతిలో తలనాన్చి "నేనసమర్థున్ని విమలా నన్ను క్షమించు" అంటూ వెక్కివెక్కి యేడ్వసాగాడు.

అతడంతకంటె ఏమీ చేయజాలని అసమర్థుడు. తొలిసారి అతడు తన యౌవ్వన జీవితంలో తప్పటడుగులువేసి క్షమింపరాని పనిచేసిన నిర్భాగ్యుడు.

పాదాలపై ఏదో కదలసాగింది. ఏదో "బుస్సు"మనే శబ్దం. చలపతి ఒక్కసారి అదిరిపడితేచాడు. శరీరం జలదరించింది. కాలికి ఏదోచుట్టుకొంది జాడించపోయాడు.

కాని మరుక్షణములోనే "అమ్మోయ్" అంటూ క్రిందకూలబడ్డాడు. అతని కేకకు అలయం గుట్టలు ప్రతిధ్వనిని పలికాయి.

* * *

విమల ఒక్కసారి ఉలిక్కిపడి లేచి కూర్చుంది. కళ్ళు నులుముకొని చుట్టూ చూసింది. లక్ష్మమ్మ నిశ్చలంగా పండుకొంది. మంచముపై పండుకొన్న రామినాయుడు గురకపెట్టున్నాడు.

మెల్లగాలేచి చలపతి గదివైపు నడిచింది. తలుపులను త్రోసింది!

ఒక్కసారి ఆమె గుండెల్లోకి బాకు దూసుకపోయినట్లయింది.

ఏడీ చలపతి! ట్రంకుపెట్టె—బెడ్డింగు ఏదీ! అంతా శూన్యం!

ఆమె చేతులతో ముఖం కప్పుకొని నిశ్శబ్దంగా ఏడ్వసాగింది!

"ఉదయమైతె-సంఘం తనవైపు వ్రేలు చూపిస్తూ "కులట" అంటుంది."

ముఖాన్ని వ్రేళ్ళతో కప్పుకొని గబగబా పరుగెత్తి ఇంటిప్రక్కనేవున్న నూతిలో పడింది.

బాలభానుని లేతకిరణాలు ఆనాడు చలపతి వూరికి వస్తున్నప్పటిలాగే ప్రసరించాయి, అయితే, ఆనాటి చలపతి ఇదే లేతకిర్ణణాలు ప్రసరించినప్పుడు మంచి హుషారుతో ఇదేబాటపై తొలి యౌవ్వన జీవితాన్నిగూర్చి కలలుకంటూ వెళ్ళాడు.

ఆ చలపతే ఈనాడు అదే ఉషఃసమయంలో ఆనాడు కన్పడిన నాగుపాము కాటుకు అదేబాటపై నోటిలోనుండి నురుగు కక్కుతూ చనిపోయాడు.

తెల్లవారగానే వూరివారు - విమలా చలపతులు లేమిచే ఆశ్చర్యపడి వూరినంతా పరిశోధించారు.

మఱ్ఱిచెట్టుక్రింది చలపతిశవం-నూతిలో విమలశవం కన్పడగానే వారు ఏమనుకొన్నారో ఏమోగాని లక్ష్మమ్మ, రామినాయుడుమాత్రం లబో, దిబోమని నోరు నెత్తి బాదుకొన్నారు.

అక్కా-మేష్టారుగారు ఒక్కరాత్రే ఎలా చనిపోయారో తెలియని సుదర్శనం అక్క శవంవైపు అమాయకంగా ముఖం పెట్టి అందరితోపాటు తనూ ఏడ్వసాగాడు.

★

---

# అదే "టీ"

రచన:

ఎస్. వి. నరసింహం

హిమగిరి ప్రాంతములోనన్
వుమపతి నాటెమొక్క నెంతోప్రేమన్,
"టీ" జెట్టె యదిపుట్టెను
తేనీటిని త్రాగుడంచు శివుడేజెప్పెన్,

"తే" నీటిని యొకకప్పుడు [న్,
తానిచ్చిన తోటి వాని స్నేహముహెచ్చు
పాటింపుము యీపాఠము,
కోటీశ్వరుడైన వాడు నిన్నేగొల్చున్.

పార్టీకెల్లను గొప్పది "టీ"
పార్టీ సకలదేశములోనన్,
"టీ" త్రాగు డనుచుబలికిరి
"టీ" త్రాగనివాడుతేనె టీగైపుట్టున్.

---

# విఫలప్రయత్నం

రచయిత: ఎ. వి. రంగయ్య

నింగిమీది చందమామ
తొంగిచూచె దొంగరీతి,
నీళ్ళలోని కలువభామ
నిక్కిజూచె నింగిదిక్కు.

పలుకరించె చందురుండు-
పలుకలేదు కలువపువ్వు;
నీళ్ళలోన మోముదాచి
మిన్నకుండె సిగ్గుతోడ.

చేయివేసి, చేరదీసి,
బంగపోయె చందమామ–;
అంతలోనె తారదేవి
భూమిచేరె, నింగివీడి.

మామచేయి విడువకుండ.
తారదేవి లాగజొచ్చె—;
చందమామ నోరుదెరిచి
కలువవంక చూడసాగె.

కలువరాణి తెగువచేసి
కలియబడెను తారతోడ;
చందమామ వూరుకుండె—
రాయివోలె, మూగవోయి.

పోరుపెరిగె తారకలువ
మధ్యలోన ఒకరినొకరు
తిట్టుకొనిరి, కొట్టుకొనిరి;
మధ్యవర్తు లెవరులేరు.

ఒక్కజాము, రెండుజాము,
గడిచిపోయె రేయియెల్ల—
అంతతెల్ల నయ్యెతూర్పు
కళ్ళుతెరిచె తార అపుడు!

ఆమెమోము ఖిన్నబోయె—;
నింగిలోన మాయమయ్యె
కలువకన్నె నీళ్ళలోన
మోముదాచి మెదలకుండె!!

చందమామ నింగినంటి
కాంతిలేక కళ్ళుమూసె,
కలువభామ కదలలేదు;
తారదేవి మెదలలేదు!!!

★